

చిన్నవంగర : గంట్లకుంటలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



చిన్నవంగర : వడ్డేకొత్తపల్లిలో ఓటేసిన రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ సుధాకర్‌రావు కుటుంబ సభ్యులు



గార్ల : పుల్లూరు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఉత్సాహంగా ఓటేసిన ప్రజలు
- పలుచోట్ల సాంకేతిక సమస్యతో పోలింగ్ ఆలస్యం

పెద్దవంగర, నవంబర్ 30 : రాష్ట్ర శాసనసభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా సాగాయి. మండలంలోని 20గ్రామాల్లో 31పోలింగ్ కేంద్రాలు ఉండగా ముగ్గురు సెక్టోరియల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది 130 మందిని నియమించారు. అవుతాపురం 148 పోలింగ్ కేంద్రం, గంట్లకుంటలో 142, 143 కేంద్రాల్లో ఈవీఎంల సాంకేతిక సమస్యతో మాక్ పోలింగ్‌తో పాటు పోలింగ్ సైతం 2గంటల ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని వడ్డేకొత్తపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావుతో పాటు కుటుంబ సభ్యులు, గంట్లకుంటలో పాలకుర్తి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పులిగిల్ల భిక్షపతి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గంట్లకుంటలో ఓటర్లు సాయంత్రం 6:30గంటలకు సైతం బారులు తీరారు.

**ఓటింగ్‌ను పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి**

తొర్రూరు : మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఉదయం మందకోడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం వరకు జోరందుతుంది. తొర్రూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో పాలకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటింగ్ సరళిని పరిశీలించారు. వెలికట్టెలో ఓ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించింది. అధికారులు వాటిని సరిచేయడంతో ఓటింగ్ యథావిధిగా నిర్వహించారు. హరిపిరాలలో రాత్రి 7గంటల వరకు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు ఓటర్లు ఉన్నారు. నూతన ఓటర్లు ఉత్సాహంతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు వృద్ధులు, దివ్యాంగులు వీల్‌చైర్‌లో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఓటు వేసేందుకు వేరే ప్రాంతంలో నివసిస్తున్న వారు ఒక రోజు ముందే స్వగ్రామాలకు తరలి వచ్చారు. గ్రామాలకు ఓటు వేసేందుకు వచ్చిన ప్రజలతో పండుగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసిన రాజకీయ చర్చ సాగింది. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

**గార్లలో..**

గార్ల : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని 190 కేంద్రంలో ఈవీఎం గంట, సీతంపేట 175 పోలింగ్ బూత్‌లో 30 నిమిషాలు పోలింగ్ నిలిచిపోయింది. ఓటర్లు ఇబ్బందిపడ్డారు. మండలంలోని 81.06 శాతం ఓట్లు నమోదైనట్లు తహసీల్దార్ స్వాతి బిందు తెలిపారు.

**కొత్తగూడ ఏజెన్సీలో 86శాతం పోలింగ్..**

కొత్తగూడ : మండలంలో గురువారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో 38 పోలింగ్ కేంద్రాల్లో 86 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల సమీపంలోకి వాహనాలను అనుమతించకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. వేలుబెల్లి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంట సేపు పోలింగ్ నిలిచిపోయింది. అధికారులు వేరే ఈవీఎంను ఏర్పాటు చేసి పోలింగ్‌ను ప్రారంభించారు. పోలింగ్ 4గంటలకే ముగిసింది. ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో ములుగు తరలించారు.

**బయ్యారంలో 80.36 శాతం పోలింగ్**

బయ్యారం : మండలంలో 80.36 శాతం పోలింగ్ నమోదైంది. బయ్యారంలోని 33 బూత్, కొత్తపేటలోని 36లో కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కేంద్రాల వద్ద జనం బారులు తీరారు. నారాయణ పురంలోని 6వ బూత్‌లో ఈవీంఎంలో సాంకేతిక లోపంతో మరో ఈవీఎం అమర్చారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో మోట్లతిమ్మపురం, గంధంపల్లి, కొత్తపేట, ఉప్పలపాడు, లక్ష్మీనర్సింహపురం, బాలాజీపేట, గొల్లగూడెం సమస్యత్మాక గ్రామాలు ఉండగా ప్రత్యేక చర్యలు చేపట్టటంతో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. పోలింగ్‌ను తహసీల్దార్ ఇస్మాయిల్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, సీఐ బాబురావు, ఎస్సై ఉపేందర్ పర్యవేక్షించారు. మండలంలోని మిర్యాలపేట గ్రామంలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.



తొర్రూరు: ఎస్‌వీకే తండాలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు



చిన్నవంగర : అవుతాపురంలో మాక్ పోల్ నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది

బయ్యారం : పోలింగ్ కేంద్రానికి వృద్ధుడిని తీసుకెళ్తున్న సిబ్బంది →





బయ్యారం : పోలింగ్ కేంద్రం వద్ద ఓటెయ్యడానికి వేచి ఉన్న మహిళలు





బయ్యారం, తొర్రూరులో మొదటిసారి ఓటేసిన యువత



గార్ల : సీతంపేటలో పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని తీసుకొస్తున్న ఏఎస్సై రవీందర్

## బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం

### కార్యకర్తలను చెదరగొట్టిన పోలీసులు

ఏటూరునాగారం, నవంబర్ 30 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ వద్ద కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ వృద్ధురాలిని బీఆర్‌ఎస్ నాయకుడికి చెందిన వాహనంలో తీసుకువచ్చారు. వాహనం గేటు దాటి వెళ్లే క్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సీతక్కనే గెలుస్తుందంటూ నినాదాలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు లక్ష్మణ్ బాబు నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ వారు కూడా నినాదాలు చేయడంతో తోపులాటకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పోలీసులు గేట్లు బంద్ చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు గొడవ సద్దు మణిగేందుకు ప్రయత్నించారు. కొద్ది సేపటికి మళ్లీ గొడవ చెలరేగడంతో సీఐ రాజు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు అందరిని చెదరగొట్టారు.

## కాల్వపల్లిలో ఓటు వేసిన నాగజ్యోతి

తాడ్వాయి, నవంబర్ 30 : బీఆర్‌ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి గురువారం తన స్వగ్రామం కాల్వపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ గ్రామం నుంచి ఎమ్మెల్యేగా టికెట్ పొందినందుకు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామంటూ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. ఆలాగే మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ తీరును పరిశీలించారు.



ఓటు వేసిన అనంతరం గ్రామస్తులతో నాగజ్యోతి

## చివరి కోరిక తీరకుండానే..

### గుండెపోటుతో వృద్ధురాలి మృతి

కేసముద్రం, నవంబర్ 30 : గుండెపోటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని కేసముద్రం విలేజి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. కొలిపాక వెంకటమ్మ (80) సాయంత్రం ఓటు వేసేందుకు తీసుకుపోవాలని కుటుంబ సభ్యులకు తెలిపింది. ఈ మేరకు వారు ఓటు వేసేందుకు తీసువెళ్లడానికి సిద్ధం అవుతుండగా ఆమె గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

## ఒకరిపై కేసు నమోదు

చిట్యాల, నవంబర్ 30 : ఓటు వేస్తూ ఫోన్‌తో వీడియో తీసి వాట్సాప్‌లో స్టేటస్ పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జంగిలి రమేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని దూత్‌పల్లి గ్రామానికి చెందిన ఎండీ జావెద్ 116పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అనంతరం తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు అదే గ్రామానికి చెందిన రాజేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## వెబ్ కాస్ట్‌లో ఓటింగ్ పరిశీలన

ములుగు టౌన్, నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ములుగు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలోని ఓటింగ్‌ను గురువారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు రత్నాకర్ ఝా, ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఈడీఎం దేవేందర్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.